క్లుప్తంగా

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా కిందపడి తప్పిపోయిన ఫోను రికవరీ చేసి బాధితుడికి అప్పగించినట్లు ఎస్ఐ నరేందర్ తెలిపారు. మండలంలోని ఆరేపల్లికి చెందిన రాంచందర్ ఆగస్టు 30వ తేదీన ఆత్మకూర్ నుంచి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా సెల్‌ఫోన్ పడిపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని హైదరాబాద్‌లోని బోరబండలో కనుక్కొని రికవరీ చేసి అప్పగించినట్లు పోలీసులు తెలిపారు. సెల్‌ఫోన్లు చోరికి గురయినా లేదా పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

ఆత్మీయ సమ్మేళనం విజయవంతం చేద్దాం




ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని పద్మశాలీ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించే డప్పు కళాకారుల ఆత్మీయ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని మండల డప్పుకళాకారుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కొండయ్య, మండల నాయకులు మొల్గర కుర్మయ్య పిలుపునిచ్చారు. బుధవారం ఆత్మీయ సమ్మేళనం కోసం ఏర్పాట్లు చేసిన వారు మాట్లాడుతూ రాష్ట్రంలో వేల సంఖ్యలో ఉన్న డప్పు కళాకారుల సంక్షేమం కోసం ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. కళాకారులందరినీ ఒకే దగ్గరికి చేర్చాలని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో శేషయ్య, మొగులయ్య, రమేష్, మన్నెం, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి ఇబ్బందులు తీర్చాలి



పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని కావలి వీధి కాలనీలో తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యను ఎన్నోసార్లు ప్రజాప్రతినిధులకు దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కావడం లేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని అధికారులు, మంత్రులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. ఈ విషయంపై బుధవారం కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శి నందకిషోర్‌కు వినతిపత్రం అందించారు. ఇప్పటికైనా నీటి సమస్యను పరిష్కరించి కాలనీ వాసులకు స్వచ్ఛమైన తాగునీరు అందించాలని కోరారు. కార్యక్రమంలో కాలనీవాసులు లక్ష్మణ్, ఆంజనేయులు, పరమేశ్వర్, కురుమూర్తి వెంకటేష్ పాల్గొన్నారు.


ఓట్ల కోసం పాట్లు..



తమ అభిమాన నాయకుడిని ఎమ్మెల్యేగా గెలిపించుకునేందుకు కార్యకర్తలు పడరాని పాట్లు పడుతున్నారు. బుధవారం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కొత్తకోటలోని చేపల మార్కెట్, కిరాణ దుకాణాలు, వీధుల్లో ఎమ్మెల్యేగా ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని మూడోసారి గెలిపించాలంటూ ఓటర్లను వేడుకోవడం కనిపించింది.

– కొత్తకోట రూరల్

మాదిగల యుద్ధభేరి కరపత్రాల విడుదల



కొల్లాపూర్ (కోడేరు): హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ ఎదుట వచ్చేనెల 5న నిర్వహించే మాదిగ యుద్ధభేరికి సంబంధించిన కరపత్రాలను ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరపాగ చంద్రబాబు, పార్లమెంట్ ఇన్‌చార్జ్ బంగారి ఉస్సేన్‌లు విడుదల చేశారు. బుధవారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఏర్పాటు చేసిన సమావేశం లో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం మాదిగలకు అన్ని రంగాల్లో అన్యాయం చేసిందన్నారు. కార్యక్రమానికి జాతీయ అధ్యక్షుడు మేడి పాపయ్య మాదిగ, రాష్ట్ర అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ మాదిగలు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో వెంకటదాసు, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.

జగజ్జనని.. పాహిమాం

ఆత్మకూర్: దేవీశరన్నవరాత్రుల ఉత్సవాల సందర్భంగా పట్టణంలోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవీగా, కోట్లాంజనేయస్వామి, అష్టలక్ష్మి ఆలయం, వాల్మీకినగర్ ఆలయంలో లో బుధవారం అమ్మవారు మహాలక్ష్మీదేవిగా దర్శనమిచ్చారు. పూజల్లో వెంకటస్వామి, రమేష్‌శెట్టి, గోపి, యాదగిరి, కృష్ణయ్యశెట్టి, ఎంపీపీ బంగారుశ్రీను, గాడి కృష్ణమూర్తి, గాడి లక్ష్మీనారాయణ, నిర్వాహకులు లక్ష్మణ్, శాంతాచారి తదితరులు పాల్గొన్నారు.

అమరచింత: పట్టణంలోని వివిధ వార్డుల్లో కొలువుదీరిన అమ్మవారు బుధవారం అన్నపూర్ణాదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో క్యామ రాములు, మేర్వరాజు, తాటికొండ రమేష్, మోదీ మనోహర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: మండలంలోని కానాయపల్లి శివారులో గల శ్రీదత్తకోటిలింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు లలితాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. సహస్రనామ స్తోత్రముతో శ్రీచక్రానికి కుంకుమార్చన చేసి దూపదీప నైవేద్యాలతో అమ్మవారికి మహామంగళహారతి ఇచ్చారు. అదేవిధంగా వాసవీకన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు మహాలక్ష్మీదేవిగా, భవానిమాత ఆలయంలో అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలకు పెద్ద ఎత్తున ఆలయానికి చేరుకుని కుంకుమార్చనలతో సామూహిక పూజలు చేశారు.

పాన్‌గల్: మండలంలోని కేతేపల్లి కన్యాకపరమేశ్వరీ ఆలయంలో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం శాకాంబరీ దేవీగా దర్శనమివ్వడంతో అమ్మవారిని రకరకాల కూరగాయలతో అలంకరించారు. కార్యక్రమంలో వీరన్నశెట్టి, రాంబాబుశెట్టి, నవీన్‌శెట్టి, శ్రీనివాసులుశెట్టి, మురళీశెట్టి, మాణిక్యంశెట్టి, చంద్రమౌలాలి పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న ఆర్యవైశ్య మహిళలు

వీపనగండ్ల: మండల కేంద్రంలోని కచ్చీరుకట్టపై ఏర్పాటు చేసిన అమ్మవారు బుధవారం లక్ష్మీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. పూజల్లో మాజీ సర్పంచ్ గంగిరెడ్డి, వంగల వెంకట్‌రెడ్డి, నారాయణరెడ్డి, శాంతిరెడ్డి, మంజుల, తేజమ్మ, హరికృష్ణ, మోహన్‌గౌడ్, నరేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: మండల కేంద్రంలోని దేవి శరవన్నరాత్రి ఉత్సవాల సందర్భంగా కన్యాకాపరమేశ్వరి ఆలయంలో అన్నపూర్ణాదేవి అవతారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని కుర్వగేరి శివాలయం వద్ద శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారు బుధవారం బాలత్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయంలో ఉదయం, సాయంత్రం అభిషేకం, కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు.



అమరచింతలో..



ఆత్మకూర్‌లోని నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో..



వీపనగండ్లలో..



ఖిల్లాఘనపురంలో..



కేతేపల్లిలో..

పల్లెలతోనే దేశాభివృద్ధి సాధ్యం

పెబ్బేరు రూరల్: పల్లెలు అభివృద్ధి చెందితేనే దేశాభివృద్ధి సాధ్యమని నమ్మిన వ్యక్తి మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అని మంత్రి సతీమణి బీఆర్ఎస్ మహిళా నాయకురాలు సింగిరెడ్డి వాసంతి అన్నారు. గురువారం ఆమె శ్రీరంగాపురం మండలంలోని జానంపేటలో స్థానిక బీఆర్ఎస్ నాయకులతో కలిసి పల్లెనిద్ర కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఇంటింటికీ తిరుగుతూ మంత్రి గతంలో చేసిన అభివృద్ధి గురించి, బీఆర్ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ గాయత్రి, సర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రెడ్డి, వినీలా రాణి, అక్కల జ్యోతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఖిల్లాఘనపురం: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన మేనిఫెస్టోను బీఆర్ఎస్ నాయకులు కింది, మధ్య తరగతి ప్రజలకు చేరేలా ప్రచారం చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు సామ్యానాయక్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య, రాష్ట్ర ఆయిల్‌ఫాం డైరెక్టర్ లక్ష్మారెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంతో పాటు దొంతికుంటతండా, మానాజీపేట, మల్కాపురంలో పర్యటించిన వారు బీఆర్ఎస్‌ను మూడో సారి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటరమణ, శేఖర్‌రెడ్డి, క్యామ రాజు, బాలీశ్వర్‌రెడ్డి, రమేష్‌శెట్టి, రాంచంద్రి, పురేందర్‌రెడ్డి, బుచ్చిబాబుగౌడ్, సత్యం పాల్గొన్నారు.



జానంపేటలో కూరగాయల వ్యాపారితో మాట్లాడుతున్న వాసంతి

అభివృద్ధి చూసే బీఆర్ఎస్‌లో చేరికలు

కొత్తకోట: పట్టణ కేంద్రంలోని 5వ వార్డుకు చెందిన 50మంది బీజేపీ కార్యకర్తలు బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు బాబురెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌లో చేరారు. బీఆర్ఎస్‌లో చేరుతున్న వారికి దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి వివిధ పార్టీలకు చెందిన వారు బీఆర్ఎస్‌లో చేరుతున్నారన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చేపడుతున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. ఎన్నికల సమయంలో మాయమాటలు చెప్పి ఓట్లు అడిగే వారిని నమ్మొద్దని, నిత్యం ప్రజల మధ్యన ఉంటూ ప్రజా సమస్యలపై శ్రమిస్తున్న తమను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ గుంత మౌనిక, సీడీసీ చైర్మన్ చెన్నకేశవరెడ్డి, విశ్వేశ్వర్, కొండారెడ్డి, చీర్ల యాదయ్యసాగర్, కె.శ్రీనివాస్‌జీ, సత్యంయాదవ్, రవీందర్‌రెడ్డి, అద్వానీ శ్రీను, సంజీవుడు, వెంకట్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

పెబ్బేరు రూరల్: తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ ఉద్యమంలో ఉమ్మడి జిల్లాలో కీలకంగా పని చేసిన విద్యార్థి నాయకుడు వనపర్తి మండలంలోని చిమనగుంటపల్లికి చెందిన ఉదయ్‌కిరణ్ బుధవారం వ్యవసాయ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. మంత్రి అతడికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో కీలకంగా పనిచేయాలని, ప్రభుత్వ మేనిఫెస్టోను ప్రతి గడపకూ తీసుకెళ్లి ప్రజలకు వివరించాలని సూచించారు.

శిథిలావస్థలో పశువుల ఆస్పత్రి

అమరచింత: మండలంలోని మస్తీపురం గ్రామంలోని పశువుల ఆస్పత్రి వినియోగానికి నోచుకోకపోవడంతో ఆస్పత్రి భవనం శిథిలావస్థకు చేరింది. అమరచింత మండల ప్రధాన పశువుల ఆస్పత్రికి అనుసంధానంగా ఉన్న సబ్‌సెంటర్ కొన్నేళ్లుగా మరుగున పడింది. ఆస్పత్రి ఆలన పాలన చూసుకోవడానికి కాంపౌండర్ సైతం నియమించకపోవడం, డిప్యూటేషన్‌పై పశుసిబ్బంది ఇతర ప్రాంతాలకు బదిలీపై వెళ్లడంతో ఇక్కడి సబ్‌సెంటర్ నిరుపయోగంగా మారింది. ఇప్పటికైనా అధికారులు స్పందించి మరుగున పడిన ఆస్పత్రి శిథిలావస్థకు చేరకుండా చర్యలు తీసుకొని పశువైద్య సిబ్బందిని నియమించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



మస్తీపురంలో శిథిలావస్థకు చేరిన పశువుల ఆస్పత్రి

పోలింగ్ కేంద్రాల్లో వసతుల పరిశీలన



కిష్టాపూర్‌తండా పోలింగ్ కేంద్రంలో వసతులపై ఆరా తీస్తున్న అధికారులు

పాన్‌గల్: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాల్లో అన్ని రకాల వసతులు కల్పించాలని ఎంపీడీఓ నాగేశ్వర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ క్షేత్ర స్థాయి సిబ్బందికి సూచించారు. బుధవారం మండలంలోని కిష్టాపూర్‌తండా పంచాయతీ భవనం, ప్రాథమిక పాఠశాలలను వారు సందర్శించి వసతులపై ఆరా తీశారు. ఆయా కేంద్రాల్లో మరుగుదొడ్లు, కిటికీల తలుపులు, విద్యుత్ సౌకర్యం, తాగునీరు, దివ్యాంగులకు అనువుగా ర్యాంపులు వంటి వసతులు తప్పక ఉండాలన్నారు. వసతుల కల్పనలో అలసత్వం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్పంచ్ దేవీసింగ్, పీఎస్ హెచ్‌ఎం మురళీ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

వీపనగండ్ల: మండలంలోని వివిధ గ్రామాల్లో ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాల్లో వసతులను బుధవారం అధికారులు పరిశీలించారు. బొల్లారం, తూముకుంట, నాగర్లబండ, సంగినేనిపల్లి గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సెక్టోరియల్ అధికారి శ్రీనివాసులు, తహసీల్దార్ వరలక్ష్మి పోలింగ్ నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమకూర్చామని, గ్రామాల్లో బీఎల్‌ఓలు ఓటర్ జాబితా తయారిలో చురుకుగా వ్యవహరించాలన్నారు. విద్యుత్, తాగునీరు, మూత్రశాలలు వంటి అన్ని వసతులు పోలింగ్ స్టేషన్‌లో ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కురుమూర్తి, బీఎల్‌ఓలు పాల్గొన్నారు.



సంగినేనిపల్లిలో..

కబడ్డీ జట్టుకు విద్యార్థి ఎంపిక



పెబ్బేరు రూరల్: రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ అండర్–19 కు పెబ్బేరు మండలంలోని ఆదర్శ పాఠశాల, కళాశాలలో ఎంపీసీ ఫస్ట్ ఇయర్ చదువుతున్న శ్రీకాంత్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ రాయిస్ ఫాతిమా, పీడీ కమలాకర్ తెలిపారు. ఈనెల 18 నుంచి 20 వరకు సంగారెడ్డి జిల్లా సదాశివపేటలో జరిగే రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలో శ్రీకాంత్ పాల్గొంటాడన్నారు.

నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు..



వీపనగండ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గత విద్యా సంవత్సరం లో ఎంపీసీలో ప్రతిభ కనబర్చిన వీపనగండ్ల విద్యార్థి మండ్ల కార్తీక్ నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికయ్యారు. కేంద్ర ప్రభుత్వం మానవ వనరుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం జాతీయ స్థాయిలో నిర్వహించే పోటీలో ప్రతిభ కనబర్చి నేషనల్ మెరిట్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థినిని కళాశాల ప్రిన్సిపాల్ రాంరెడ్డి అభినందించారు. స్కాలర్‌షిప్ ద్వారా విద్యార్థికి రూ.70 వేల ఆర్థికసాయం అందనుంది.

బెల్టు షాపుల్లో తనిఖీ

అమరచింత: మండలంలోని చంద్రనాయక్ తండాలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్టు షాప్‌లో తనిఖీ నిర్వహించి యజమానిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ జగన్మోహన్ తెలిపారు. ఎన్నికల నిబంధనలో భాగంగా గ్రామాల్లో అక్రమంగా మద్యం విక్రయాలు నిర్వహిస్తున్న వారి వివరాలను సేకరిస్తూ ఆకస్మికంగా దాడులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చంద్రనాయక్‌తండాకు చెందిన మణ్యం అక్రమంగా మద్యం విక్రయిస్తుండగా దాడులు నిర్వహించి ఎనిమిది బీరు సీసాలు, మూడు క్వాటర్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

నిరుద్యోగులను నిండా ముంచిన కేసీఆర్



మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న బాలకిష్టాపూర్ గ్రామస్తులు

ఆత్మకూర్: మరోసారి అధికారంలోకి రావాడానికి ముఖ్యమంత్రి కేసీఆర్, బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు హామీలతో ముందుకొస్తున్నారని, వారిని ప్రజలు తిప్పికొట్టాల్సిన అవసరం వచ్చిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని బాలకిష్టాపూర్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు జలంధర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు. నిరుద్యోగులను నిండా ముంచి మద్యానికి బానిసలుగా మార్చారని, దేశానికి ఎంతో ఉపయోగపడే యువత చెడు వ్యసనాలతో దారి తప్పేలా చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చి, ఇన్నేళ్లు అధికారంలో ఉండి చేయలేనివి మళ్లీ అధికారంలోకి వస్తే ఎలా చేస్తారనే విషయాన్ని అడుగడుగునా బీఆర్ఎస్ నాయకులను ప్రజలు ప్రశ్నించాలని కోరారు.

బీజేపీతోనే అభివృద్ధి

ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో దూసుకెళ్తుందని, బీజేపీ ప్రభుత్వంతోనే సుస్థిర పాలన సాధ్యమన్నారు. త్వరలోనే రానున్న ఎన్నికల్లో అధికార బీఆర్ఎస్‌కు, కాంగ్రెస్ పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అశ్విన్‌కుమార్, రేచింతల శ్రీను, నాగేందర్‌రెడ్డి, శివశంకర్, చిన్ననర్సింహ, శశిధర్‌రెడ్డి, తమ్మలి వెంకటేష్, గాడి శేషు, రఘుయాదవ్, బాలకృష్ణ, వెంకట్రాములు, రాము, ఆదర్శ్, రాజు, అశోక్, సూరి తదీతరులు ఉన్నారు.



చిన్నంబావిలో మాట్లాడుతున్న సుధాకర్‌రావు

వచ్చే ఎన్నికల్లో బీజేపీని ఆదరించండి

చిన్నంబావి: రానున్న ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని నాగర్‌కర్నూల్ జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఏల్లేని సుధాకర్‌రావు కోరారు. మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ప్రారంభించిన యువ భరోసా యాత్రకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్, రాష్ట్ర అభివృద్ధి కోసం యువత బీజేపీ పార్టీని ఆదరించాలని కోరారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండు తోడుదొంగల పార్టీలేనన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగ సమస్యతో యువత సతమతమవుతూ యువత ఆత్మహత్య చేసుకుంటుంటే రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరేత్తినట్లు వ్యవహరిస్తోందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు జగ్గారి శ్రీధర్‌రెడ్డి, మేకల శ్రీనివాస్‌యాదవ్, రామన్‌గౌడ్, గణేష్‌రెడ్డి, సంపత్‌కుమార్, కురుమయ్య, చెన్నయ్య, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబరాలు



అమరచింతలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న బీజేపీ మహిళా మోర్చానాయకురాలు పద్మజారెడ్డి

ఆత్మకూర్: పట్టణంలోని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో వాసవి కన్యకాపరమేశ్వరి మాతా ఆలయంలో బుధవారం రాత్రి వాసవీ దుర్గామాతకు భక్తిశ్రద్ధలతో పల్లకీసేవ నిర్వహించారు. బతుకమ్మకు పూజలు చేసి ఆడి పాడారు. అలాగే మహాలక్ష్మి అమ్మవారికి నాణెలతో అభిషేకం చేశారురు.

అమరచింత: పట్టణంలోని విష్ణుశ్వరనగర్‌లో ఏర్పాటు చేసిన భవానీమాత మండపం వద్ద బుధవారం బతుకమ్మ సంబురాలను ఘనంగా నిర్వహించారు. బీజేపీ రాష్ట్ర నాయకుడు జలేంధర్‌రెడ్డి సతీమణి పద్మజారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ మహిళా మోర్చా సభ్యులతో కలిసి బతుకమ్మకు పూజలు చేసి బతుకమ్మ పాటలకు కోలాటం వేశారు. కార్యక్రమంలో మేర్వరాజు, క్యామ భాస్కర్, మరాఠి అశోక్, నరాల నారాయణ, దుబాయి వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం బతుకమ్మ సంబురాలను ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రకరకాల పూలతో ఆలకరించిన బతుకమ్మలను కళాశాల ఆవరణలో పెట్టి విద్యార్థులు, అధ్యాపకులు ఆట, పాటలతో బతుకమ్మ ఆడుతూ బొడ్డెమ్మలు కొట్టారు. అనంతరం బతుకమ్మలను నెత్తిన పెట్టుకొని ఊరేగింపుగా సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు.

అత్యధిక ఉత్తీర్ణత సాధించాలి

విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా అత్యధిక ఉత్తీర్ణత సాధించి కళాశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకరావాలని కళాశాల ప్రిన్సిపాల్ ప్రకాశంశెట్టి అన్నారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ లక్ష్యానికి అనుగుణంగా చదివితే మంచి ఫలితాలు సాధిస్తారన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



పాన్‌గల్ ప్రభుత్వ కళాశాలలో..

చివరికి ఆయకట్టుకు సాగునీరు అందించాలి

పెబ్బేరు రూరల్: చివరి ఆయకట్టుకు సాగునీరు అందించాలని వీపనగండ్ల మండల రైతు సంఘం ఆధ్వర్యంలో బుధవారం పెబ్బేరు మండల కేంద్రంలోని పీజేపీ డివిజన్ ఆఫీస్‌లో ఈఈ జగన్‌మోహన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. వీపనగండ్ల మండలంలోని జూరాల ఎడమకాల్వ కింద డీ–37, 38, 39, 40 చివరి ఆయకట్టు కింద సాగు చేసిన పంటలు నీరందక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలు ఎండిపోకుండా కాల్వలకు సాగునీరు వదిలి పంటలను కాపాడాలని ఆయకట్టు రైతులు ఈఈ ని కోరారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ కాల్వల కింద నీళ్లు సరిగా రాకపోవడంతో మినుములు, వేరుశనగ, వరి మొదలుగు పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. ఇప్పటికే వర్షాలు రాక జూరాల కాల్వల ద్వారా నీటి సరఫరా కాకపోవడతో 40 శాతం పంటలు ఎండిపోయే ప్రమాదం ఉందన్నా. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనేయులు, ఎండీ ఖాజా, వెంకటస్వామిగౌడ్, వెంకటస్వామి, బిచ్చన్న, సాయి, పరమేశ్వర్‌రెడ్డి, నవీన్‌గౌడ్, శ్రీనివాసులు, చిన్నబాలస్వామి, గుడ్డన్న, సర్పంచ్ రాముడు, వెంకటస్వామి, రాముడు తదితర రైతులు పాల్గొన్నారు.



పెబ్బేరులో ఈఈకి వినతి పత్రం అందిస్తున్న రైతులు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 97051 35557
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 95539 55603
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com